## క్లుప్తంగా

### పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



బాలికల హాస్టల్‌లో మలాథిన్ స్ప్రే చేస్తున్న సిబ్బంది

పాలసముద్రం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మండల వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీ సిబ్బంది సుశీల, మురళీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి గృహాలకు వెళ్లి దోమలు, లార్వాలు వృద్ధి చెందకుండా మలాథిన్ మందును పిచికారీ చేశారు. మోహన్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేయక ముందే చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పరిసరాలు శుభ్రంగా దోమలు రావన్నారు.

### అడవికి నిప్పు



కాలుతున్న అడవి

పాలసముద్రం : మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అడవికి గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం నిప్పు పెట్టారు. సుమారు 550 హెక్టార్ల మేరకు అడవి దగ్గం అయినట్లు అంచనా. సాయంత్రం పెద్దశబ్దాలతో మంటలు రేగడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. మంటలు ఎగసి పడుతుండడంతో అదుపు చేసేందుకు వీలుకాక ఏమీ చేయలేకపోయారు.

### జిల్లా ఎస్సీ సెల్ విభాగంలోకి సత్యరాజ్



సత్యరాజ్

నింద్ర: చిత్తూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీగా సత్యరాజను నియమిస్తూ బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. తాజాగా పార్టీలో పలువురికి పదవులు కల్పించిన విషయం తెలిసిందే. అందులో నగరి నియోజకవర్గం నింద్ర మండలానికి చెందిన చవరంబాకం గ్రామానికి చెందిన సత్యరాజ్‌ను జిల్లా ఎస్సీ సెల్ విభాగంలోకి తీసకున్నారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ పదవి రావడానికి కృషి చేసిన మంత్రి రోజాకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పల్లికొండేశ్వరస్వామి సేవలో డీఎఫ్‌ఓ



ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

నాగలాపురం: సురుటుపల్లిలోని శ్రీపల్లి కొండేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి నూకవారపు నాగేశ్వరరావు దర్శిం చారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీస్వా మి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈవో కె.రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

### ఉత్తమ సేవలతోనే గుర్తింపు



సత్కారం అందుకుంటున్న హెచ్‌ఎం లలిత

సత్యవేడు: ఉత్తమ సేవలతో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ కే.రవి అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.లలిత స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎంఈఓ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ2 ఉష పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు ఆమెను సత్కరించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### వరకట్న వేధింపులతో గర్భిణి ఆత్మహత్య

శ్రీకాళహస్తి : వరక ట్నం వేధింపులు తాళలేక ఏడునెలల గర్భిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీకాళహస్తి మండలం ఇసుకగుంటలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇసుకగుంటకు చెందిన అక్బర్‌బాషా కుమార్తె షేక్ జాస్మిన్(23)ను అదే గ్రామానికి చెందిన అమీర్ సొహైల్‌కు ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం జరిపించారు. అమీర్ సొహై ల్‌కు కట్నం, లాంఛనాలు ఇచ్చారు. అప్పటి నుంచి వారి దాంపత్యం సవ్యంగానే సాగడంతో రెండేళ్ల కిందట వారికి ఓ బాలుడు జన్మించాడు. ప్రస్తుతం జాస్మిన్ ఏడునెలల గర్భిణి. ఇటీవల అమీర్ సొహైల్, అతని తల్లి ఖాదర్‌బీ ఆమెను పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించడం మొదలు పెట్టారు. వేధింపులను భరించలేక జాస్మిన్ బుధవారం ఇంట్లో ఉరేసుకుంది. అత్తింటి కట్నం దాహానికి తన కుమార్తె మృతి చెందినట్లు అక్బర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. జాస్మిన్ భర్త అమీర్ సొహైల్, అతని తల్లి ఖాదర్‌బీపై వరకట్నం కేసు నమోదు చేశారు.

# ప్రజా అవసరాలు తీర్చడమే లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్



సమావేశంలో మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న కౌన్సిలర్

నగరి : అన్ని వార్డుల్లో ప్రజల అవసరాలు తీర్చుకుంటూ ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. బుధవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి ఆదేశానుసారం మున్సిపల్ అధికారులు సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉన్నా తెలపాలంటూ మున్సిపల్ చైర్మన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ కుశస్థలి నదిపై రోడ్డు సమస్యను రెండు సమావేశాల్లో కౌన్సిల్ దృష్టికి తెచ్చానని నేడు మంత్రి ఆర్‌కే రోజా రోడ్డు పనులు పూర్తి చేశారని ఆమెకు కౌన్సిల్ నుంచి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు చెప్పారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లోను అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల మేర నిధులతో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించగా అవి వేగంగా జరుగుతోందన్నారు. ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేస్తూ వెళ్తున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కౌన్సిల్ ఆమోదించిన అంశాలు**

- 2024లో సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంపు, తాగునీరు, టాయిలెట్లు, విద్యుద్దీకరణ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి రూ.1.98 లక్షల నిధులు వెచ్చింపు
- రూ.75 లక్షల గడప గడపకు నిధుల ద్వారా మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి కేటాయింపు
- రూ.8 లక్షల నిధులతో కాకవేడు రెవెన్యూ, జీవీ ఎన్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయింపు
- రూ.20 లక్షల నిధులతో 6వ వార్డు శ్మశాన వాటికలో టాయిలెట్లు, షెడ్డు నిర్మాణానికి కేటాయింపు

# డీటీ లక్ష్మీపతి సేవలు అభినందనీయం



లక్ష్మీపతి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

కార్వేటినగరం: డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీపతి సేవలు అభినందనీయమని తహసీల్దార్లు రవికుమార్, అమరేంద్రబాబు అన్నారు. బుధవారం పుత్తూరు ఏఎండీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన లక్ష్మీపతి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేశారని కొనియాడారు. లక్ష్మీపతి దంపతులను అధికారులు, రెవెన్యూ సిబ్బంది. ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఉపాధి ఏపీడీ చిన్నరెడ్డెప్ప, ఎంపీడీవో మోహన్‌మురళి, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, మండల కో–ఆప్షన్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ధనంజయవర్మ పాల్గొన్నారు.

### రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం



కాలువ నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది

నగరి : మున్సిపల్ పరిధిలోని భీమానగర్‌లో స్థల వివాదాల కారణంగా రెండు దశాబ్దాలపాటు కొనసాగిన మురుగు కాలువ సమస్యకు మంత్రి ఆర్కేరోజా పరిష్కారం చూపారు. అందరితో చర్చించి సమస్యను పరిష్కరించారు. మురుగు ముందుకు వెళ్లే మార్గం లేక ఈ ప్రాంతం వారు రెండు దశాబ్దాలపాటు ఎదుర్కొంటున్న సమస్యకు తెర పడింది. బుధవారం కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.30 లక్షల నిధులతో 460 మీటర్ల మేర కుశస్థలి నది వరకు కాలువ నిర్మాణం జరుగుతుందని, కాలువతో పాటు సిమెంటు రోడ్డుకూడా నిర్మిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. పార్టీ స్థానిక నాయకులు ఇళంగో, ఎల్లప్పరెడ్డి పనుల పర్యవేక్షణ చేస్తున్నారు. అపరిష్కృతంగా ఉన్న కాలువ సమస్యకు పరిష్కారం దొరకడంతో పాటు పనులు కూడా చకచక ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### యంత్ర సాగుతో అధిక దిగుబడులు

సత్యవేడు: రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతి పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మదనంబేడు రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో సేద్యం చేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నా రు. సూక్ష్మపోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఎకరాకు నాలుగు బస్తాల జిప్సం ఎరువును రెండవ కలుపుతీత ముందు పొలంలో చల్లాలని సూచించారు. ఏఓలు మురళి, శ్రీనివాస్, వీహెచ్ఏ మురళి పాల్గొన్నారు.

# గర్భిణులకు అన్నదానం




భోజనం వడ్డిస్తున్న వైద్యులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. గర్భధారణ పరీక్షల సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చే వారు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని మంత్రి ఆర్కేరోజా నిరంతరంగా నిర్వహిస్తున్నారు. గర్భిణులతో పాటు వారి వెంట వచ్చే వారికి కూడా ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదినా చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆర్ఎంఓ మంజుల, వైద్యులు కార్తిక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.

# బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తకండ్రిగ గ్రామ దళితవాడలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. వారిని ఒప్పించి పాఠశాలకు పంపించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వ ప్రోత్సాహకంగా అమ్మ ఒడి పథకం కింద తల్లికి రూ.14 వేలు ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

- హోరాహోరీగా తలపడిన జట్లు
- ముగిసిన ఖో–ఖో, వాలీబాల్ పోటీలు



చిత్తూరు–పలమనేరు మహిళా జట్ల మధ్య కబడ్డీ ఫైనల్స్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో బుధవారం ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు కొనసాగాయి. జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, నగరి, జీడీ నెల్లూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుంచి కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడలకు పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు క్రీడాపోటీల్లో 40 మ్యాచ్‌లకు షెడ్యూల్ ఇచ్చారు. రాత్రి 9.30 గంటల సమయానికి 28 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. మిగిలిన మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు.

**ఖో–ఖో విన్నర్స్ పలమనేరు, పూతలపట్టు**

ఖోఖో పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల విభాగం ఫైనల్స్‌లో పలమనేరు–పూతలపట్టుపై విజయం సాధించింది. కుప్పం మూడవ స్థానంలో నిలిచింది. ఇక మహిళల విభాగం ఖో–ఖో ఫైనల్స్‌లో పూతలపట్టు–పలమనేరుపై గెలుపొందింది. మూడవ స్థానంలో జీడీ నెల్లూరు జట్టు నిలిచింది.

**వాలీబాల్ విన్నర్స్ చిత్తూరు, పలమనేరు**

వాలీబాల్ పోటీల్లో పలు నియోజకవర్గాల జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన పురుషుల విభాగం ఫైనల్స్‌లో చిత్తూరు–పుంగనూరుపై విజయం సాధించింది. జీడీ నెల్లూరు జట్టు మూడవ స్థానంలో నిలిచింది. మహిళ విభాగంలో పోటీల్లో పలమనేరు–పూతలపట్టుపై గెలిచింది. నగరి మూడవ స్థానంలో నిలిచింది.

**మహిళల కబడ్డీ విభాగం ఫైనల్స్‌లో రగడ..పుంగనూరు జట్టుపై వేటు**

మహిళల విభాగం కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. అయితే ఫైనల్స్‌లో జట్ల నడుమ నడుమ వాగ్వాదాలు చోటుచేసుకుని చాలాసేపు పోటీలు నిలిచిపోయాయి. ఫైనల్స్ చిత్తూరు, పుంగనూరు జట్లు చేరాయి. అర్హత లేని ప్రాంతాలకు చెందిన వారు పుంగనూరు జట్టులో ఆడుతున్నారని చిత్తూరు మహిళల జట్టు ఆరోపించడంతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. పుంగనూరు జట్టు క్రీడాకారిణులు ఆధార్‌కార్డులను చూపించినప్పటికీ వారిని ఎవ్వరూ పట్టించుకోలేదు.

చివరికి వారిని పోటీల నుంచి తొలగించి తదుపరి జట్టుతో పోటీలు ప్రారంభించారు. తర్వాత ప్రారంభమైన చిత్తూరు, పలమనేరు జట్ల మధ్య పోటీలు కొనసాగాయి. ఈ పోటీల్లో చిత్తూరు జట్టును విజేతగా ప్రకటించారు. బాలుర కబడ్డీ పోటీల్లో నగరి, పూతలపట్టు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి.



చిత్తూరు–పలమనేరు జట్ల క్రీడాకారుల మధ్య జరుగుతున్న కబడ్డీ పోటీలు



ఖో–ఖో ఫైనల్స్‌లో తలపడిన పలమనేరు–పూతలపట్టు జట్ల క్రీడాకారులు



చిత్తూరు– పుంగనూరు క్రీడాకారుల మధ్య వాలీబాల్ ఫైనల్ పోటీలు



పలమనేరు–పూతలపట్టు మహిళల మధ్య వాలీబాల్ ఫైనల్స్



సదస్సుకు హాజరైన విద్యార్థులు

# ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది సంజీవి

పుత్తూరు: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది సంజీవి తెలిపారు. బుధవారం పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య పాఠశాలలో వీధి బాలల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లలందరికీ ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని, తమ పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను షాపుల్లో, వ్యాపార సంస్థల్లో, కర్మాగారాల్లో, వ్యవసాయ భూములు తదితర పనుల్లో ఉంచరాదని వివరించారు. అలా చేస్తే శిక్షార్హులని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, విద్యా హక్కు చట్టం గురించి వివరించారు.

# వైభవంగా మహా కుంభాభిషేకం ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

కార్వేటినగరం: మండల కేంద్రంలో స్కంధ పుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసి ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో రాజగోపురం మహా కుంభాభిషేకం బుధవారం అత్యంత ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకు స్వామివారికి ఆరాధన, అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. గణపతి హోమం, సుబ్రమణ్యస్వామి హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆరు నుంచి టీటీడీ ధర్మప్రచార పరిషత్ వారిచే హరికథా కార్యక్రమం నిర్వహించారు.

**నేడు రాజగోపుర మహాకుంభాభిషేకం**

- గురువారం ఉదయం 10.55 నుంచి 11.59 గంటల వరకు మేష లగ్నంలో ఆలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన రాజగోపురానికి మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# అభివృద్ధి పనులు వేగవంతం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

నారాయణవనం: మండలంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తే, సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా తాను శ్రద్ధ తీసుకుంటానని తిరుపతి ఎంపీ, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త మద్దిల గురుమూర్తి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అన్నిశాఖల అధికారులతో ఎంపీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షన జరిగిన సమావేశంలో గురుమూర్తి మాట్లాడుతూ 20 రోజుల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. జరిగిన పనులకు తక్షణం ఎంబుక్‌లను రికార్డు చేయిస్తే, ఉన్నతాధికారులతో చర్చించి, బిల్లులు తక్షణం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొండలచెరువు గ్రామంలో సబ్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు గ్రావెల్ రోడ్ల ఏర్పాట్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని సూచించారు. పూల సాగుకు అనుకూలమైన మండలంలో రైతులను ప్రోత్సహించాలని, ఫార్మ ర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజషన్(ఎఫ్‌పీఓ) ఏర్పాటుపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి శోభారాణికి సూచించారు.

**నేత కార్మికుల సమస్యలు సీఎం దృష్టికి**

పవర్‌లూమ్స్‌తో వచ్చే కరెంట్ బిల్లుతో సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్న చేనేత కార్మికుల సమస్య పరిష్కారం కోరుతూ ఇదివరకే వెంకటగిరి సామాజిక సాధికార యాత్ర సందర్భంగా తీర్మానం చేసినట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. సమస్యపై మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండలంలో సమస్యలని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణంలో చిన్న చిన్న అడ్డంకులను సాకుగా చూపకుండా పేదలకు లబ్ధి చేకూరేలా చొరవ చూపాలని తెలిపారు. సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకుల పట్ల అధికారులు సాదరంగా వ్యవహరించాలని, వారి సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు. ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులు అధికారులతో సమన్వ యపరచుకుంటూ సామరస్యంతో పనులను చేసుకోవాలన్నారు.

సమావేశంలో పీఆర్ డీఈ మధుసూదన్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ ప్రమీల, అన్ని శాఖల మండల అధికారులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, కోఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఉరప్ప, కైలాసకోన ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మామిడికి మంచు దెబ్బ



కనమనంబేడు గ్రామంలో పూతరాని మామిడి చెట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: పొగమంచుతో మామిడి చెట్లలో పూత రాక పోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కనమనంబేడు, గాజులపెళ్లూరు, కుక్కంబాకం, కంచనపుత్తూరు. ఆలత్తూరు, పీవీకండ్రిగ, బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు, నెలవాయి, వెస్టువరత్తూరు గ్రామాల్లో 400 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో పూత వస్తుంది. పూత వచ్చిన సమయంలో వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. జనవరి నెలలో వర్షాలు పడడంతో పాటు అధికంగా పొగ మంచు కురుస్తుండడంతో పూత రావడంలో ఆలస్యం నెలకుంటోంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండావలసిన తోటలు మంచుతో బోసిపోయి కనిపిస్తున్నాయి. పొగమంచు అధికంగా ఉండడంతో తేనె మంచు పురుగు ఆశిస్తోందని రైతులు చెబుతున్నారు.

**పత్తాలేని ఉద్యానవనశాఖాధికారులు**

మామిడి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వలసిన ఉద్యానవనశాఖాధికారులు మండలంలో విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మిరప, మామిడి పంటలను ఆశిస్తున్న తెగుళ్ల గురించి తెలియక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పురుగు మందుల డీలర్లపై ఆధారపడుతున్నారు. ఇప్పటికైనా ఉద్యానవనశాఖాధికారులు మండలంలో పర్యటించి సలహాలు అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

**మందులు పిచికారీ చేయాలి**

పొగమంచు అధికంగా ఉండడంతో తేనె మంచు పురుగు ఆశిస్తోంది. పిందెలు కాడల రసాన్ని పీల్చడం కారణంగా తోటలకు నష్టం వాట్టిల్లుతుంది. దీని నివారణకు కాన్ఫిడార్ మందు 0.5 ఎంఎల్, సాఫ్ 2 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25 ఎంఎల్ లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.

– భారతి, మండల వ్యవసాయాధికారి